క్లుప్తంగా

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ రద్దు

కర్నూలు (టౌన్): ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఈనెల 13న ఉండదని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఆదివారం క్యాంపు సెక్షన్ పరిధిలో విద్యుత్ నిలిపి వేయనున్నట్లు ఈఈ శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ క్యాంపు, విజ్ఞాన మందిరం, బిర్లా కాంపౌండ్, అరోరా నగర్, గాయత్రి ఎస్టేట్, బిర్లాగడ్డ, శ్రీలక్ష్మీనగర్, టెలికాం నగర్, శ్రీలక్ష్మినర్, డాక్టర్స్ కాలని, జేసీ బంగ్లా, అమ్మ హాస్పిటల్ తదితర కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు.

15న గోపూజ

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15న కనుమను పురస్కరించుకుని గోపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు పేర్కొన్నారు. శనివారం గోదా గో కులంలో కార్యక్రమ ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగర శివారులోని గోదాగోకులంలో వెలసిన గోదా రంగనాథ స్వామి దేవస్థానంలో, నంద్యాల జిల్లా మిడుతూరులోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఉదయం 10 గంటలకు గోపూజ, గో విశిష్టతపై ధార్మిక ప్రవచనాన్ని ఏర్పాటు చేశామన్నారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మైపర్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే



వేదికపై ఆశీనులైన అతిథులు

కర్నూలు కల్చరల్: స్థానిక ఎ.క్యాంప్‌లోని మైపర్ ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అనంతపురం జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఎ.సురేష్‌బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూషన్స్ డాక్టర్ ఎ.శివకుమార్ హాజరై వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ ఆదిమూలపు సతీష్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కాసర్ల సురేష్, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ రాజ్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రఘువీర్ పాల్గొన్నారు.

నేడు వివేకానంద జయంతి

కర్నూలు కల్చరల్: వివేకానంద రాక్ మెమోరియల్, వివేకానంద కేంద్ర కర్నూలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు వివేకానంద సర్కిల్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు వివేకానంద కేంద్ర ప్రతినిధి శివప్రసాద్ తెలిపారు.

అన్న క్యాంటీన్ తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఎస్.రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఆదేశించారు. శనివారం స్థానిక నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం రూ.5 లకే నాణ్యమైన భోజనం అందిస్తుందని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

కర్నూలు కల్చరల్: కళా సౌరభ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నటరాజ నృత్య కళా మందిర్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్తగా సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, నటరాజ నృత్య కళా మందిర్ నిర్వాహకులు కరీముల్లా, అధ్యక్షులు స్వరూపసింహ, సభ్యులు పాల్గొన్నారు.

యువోత్సాహం..

- ఎందులోనూ తగ్గమంటున్న యువత
- వివేకానంద స్ఫూర్తితో ముందుకుసాగుతున్న వైనం
- నేడు వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం
- పలు రంగాల్లో రాణిస్తూ సరిలేరు మాకెవ్వరూ అంటున్న యువతీ యువకులు



కర్నూలు కల్చరల్: 'నిన్ను నువ్వు నమ్ము.. ప్రపంచమే నీ పాదాక్రాంతమవుతుంది. నీపై నీకు నమ్మకం లేనప్పుడు ఆ భగవంతుడూ నీకు అండగా నిలవలేడు' అన్న స్వామి వివేకానందుని వ్యాఖ్యలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగుతోంది. దేశ భవిష్యత్తు యువ శక్తిపైనే ఆధారపడి ఉంది. యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద. యువతరం గళమెత్తితే నవతరం శివమెత్తితే ప్రగతి కళ్లముందు ప్రత్యక్షమవుతుంది. ఈ సత్యాన్ని గ్రహించి యువతీ యువకులు తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడంతో పాటు దేశ భవితకు పాటుపడాల్సిన అవసరం ఉంది. యువ శక్తి నవ శక్తిలో మేళవించి నైతిక విలువలను మానవతా విలువలను పాటిస్తూ ముందుకు సాగిపోతే దేశ భవిత ఉజ్వలంగా ఉంటుందనడంలో సందేహం లేదు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 'జాతీయ యువజన దినోత్సవం'ను పురస్కరించుకుని వివిధ రంగాల్లో రాణిస్తూ తమకెవ్వరూ సరిలేరు అంటున్న విజేతల గురించి తెలుసుకుందాం.



ఈ చిత్రంలో ఉన్నది పోతురాజు ధరణికుమార్. కర్నూలు ఎన్‌సీసీ గ్రూప్ నుంచి ఆర్‌డీసీ(రిపబ్లిక్ డే క్యాంప్)కు ఎంపికయ్యాడు. కర్నూలుకు చెందిన సుభాషిణి, టెలికాం డిపార్ట్‌మెంట్ జీఎం జి.కిషోర్ కుమార్ (గత ఏడాది అక్టోబర్‌లో మరణించారు) దంపతుల కుమారుడు. పత్తికొండ ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పాఠశాల విద్య, కర్నూలు సెయింట్ జోసప్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. ప్రస్తుతం జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గతంలో ఇంటర్ కాలేజియేట్ క్రీడలు, నృత్య పోటీల్లో పాల్గొన్నాడు. బీటెక్ చదువుతూ ఎన్‌సీసీలో ఆర్‌డీసీకి ఎంపికయ్యాడు. ఎన్‌సీసీలో సీఏటీసీ 1, 8, ఐజీసీ క్యాం, పీఆర్‌డీసీ 1, 2, 3, 4 పూర్తి చేసుకొని ఢిల్లీ ఆర్‌డీసీకి ఎంపికయ్యాడు. ఏపీ నుంచి 135 మంది ఎన్‌సీసీ కేడెట్స్‌లో ధరణికుమార్ ఒకరు. గత నెల 29 నుంచి ఈనెల 29 వరకు ఢిల్లీలో జరుగుతున్న గ్రూప్ డాన్స్ ఈవెంట్‌ను పూర్తి చేసుకొని ప్రస్తుతం రిపబ్లిక్ డే ప్రైమ్‌మినిస్టర్ పరేడ్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కాంటింజెంట్‌కు ప్రాక్టీస్ చేస్తున్నాడు. అమ్మ ప్రోత్సాహం, కళాశాల యాజమాన్యం సహాయ సహకారాలతో వివిధ రంగాల్లో రాణిస్తున్నానని, భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమై ఐఏఎస్ కావాలన్నది తన లక్ష్యమని ధరణికుమార్ పేర్కొంటున్నాడు.



చిత్రంలో ఉన్నది బంగారి ధరణి. కొత్తాళానికి చెందిన వ్యవసాయదారులు బంగారి చెన్నబసమ్మ, బసవరాజు దంపతుల కుమార్తె. కొత్తాళం జెడ్పీహెచ్ఎస్‌లో పాఠశాల విద్య, మంత్రాలయం మోడల్ కాలేజ్‌లో ఇంటర్ పూర్తి చేసి ప్రస్తుతం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. పాఠశాల స్థాయి నుంచే చదువుతోపాటు సహపాఠ్యాంశాల్లో ప్రతిభ కనబరిచేది. బాస్కెట్ బాల్, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఇస్తూ ప్రశంసలు అందుకుంది. ఎన్‌సీసీలో ఉంటూ దేశభక్తిని చాటుతోంది. ఈమెలో ఉన్న ప్రతిభను గుర్తించిన కళాశాల అధ్యాపకులు యువజనోత్సవ శాఖ నిర్వహించిన పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించారు. జిల్లాస్థాయి పోటీల్లో జానపద నృత్యం సోలో పెర్ఫార్మెన్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. దీంతో పాటు కళాశాలలో జరిగే ప్రతి కార్యక్రమంలో కూచిపూడితో స్వాగత నృత్యం ప్రదర్శించి ప్రశంసలు అందుకుంటోంది. భవిష్యత్తులో ఐఏఎస్ సాధించాలన్నది తన లక్ష్యమని ధరణి చెబుతోంది.



చిత్రంలో ఉన్న యువతి తెలుగు ఉషారాణి. యూత్ వికసిత్ భారత్‌లో భాగంగా స్టోరీ రైటింగ్‌లో నేషనల్ లెవల్ యూత్‌ఫెస్టివల్‌కు ఎంపికైంది. నందవరం మండలం మిట్టసోమాపురం గ్రామానికి చెందిన మహేశ్వరి,రాముడు (టైలర్) దంపతుల కుమార్తె. పేద కుటుంబానికి చెందిన ఈ యువతి ఢిల్లీలో ప్రధాన మంత్రి పాల్గొనే ప్రోగ్రామ్‌కు హాజరు కానుంది. మిట్టసోమాపురం, నాగులదిన్నెలో పాఠశాల విద్య, ఇంటర్మీడియెట్ చదివారు. ప్రస్తుతం కేవీఆర్ కళాశాలలో డిగ్రీ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమె కవితలు, కథలు రాసేది. గత ఏడాది సాహితీ సదస్సు వారు నిర్వహించిన కవితల పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమెలో ఉన్న ప్రతిభను గుర్తించి కళాశాల తెలుగు అధ్యాపకురాలు పార్వతీదేవి, ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ గుర్తించి ప్రోత్సహించడంతో గత ఏడాది వికసిత్ భారత్ భాగంగా నిర్వహించిన యంగ్ లీడర్ షిప్ - వుమెన్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొని 'తెర వెనక ఉన్న ఓ పిట్ట కథ' స్టోరీ రాసింది. ఇందులో ఏపీ నుంచి పాల్గొన్న 30 మంది యుతవకు రెండు రౌండ్లలోలు నిర్వహించగా ఉషారాణి నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఎంపికైంది. ప్రస్తుతం ఢిల్లీలో ప్రోగ్రామ్‌లో పాల్గొంటోంది.ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, యువజన క్రీడల శాఖ మంత్రి మనసుఖ్ మానవీయ పాల్గొనే కార్యక్రమంలో ఉషారాణి తన స్టోరీని ప్రజెంట్ చేయనుంది. వారితో కలిసి లంచ్, డిన్నర్ చేయనుంది. ఢిల్లీ స్థాయిలో పాల్గొన్న ఈ విద్యార్థినిని క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టు వెంకటేశ్వర్లు అభినందించారు. భవిష్యత్‌లో వృక్ష శాస్త్ర అధ్యాపకురాలిగా స్థిరపడి తన లాంటి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నది తన లక్ష్యమని ఉషారాణి చెబుతోంది.

సృజనాత్మకత కలిగి ఉండాలి



విజేతలతో బలిజ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: ప్రతిఒక్కరూ సృజనాత్మకత కలిగి ఉండాలని మహేంద్ర ఆటోమోటివ్ మేనేజింగ్ డైరెక్టర్ యర్రంశెట్టి రాజేశ్వరి అన్నారు. శనివారం ఎ.క్యాంప్ మాంటిస్సోరి స్కూల్ గ్రౌండ్‌లో కర్నూలు నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో 'రాయల మహిళలు - రంగవల్లులు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రథమ బహుమతి లక్ష్మీదేవి, ద్వితీయ బహుమతి ఉమా పార్వతి, తృతీయ బహుమతి లీలావతితో పాటు గాయత్రి, దివ్య, లక్ష్మి కన్సొలేషన్ బహుమతులు దక్కించుకున్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, రాజేశ్వరి, కాంట్రాక్టర్ ఉలిందకొండ వెంకటరమణ మాట్లాడారు. న్యాయ నిర్ణేతలుగా కేవీఆర్ కళాశాల అధ్యాపకురాలు జయలక్ష్మి, డాక్టర్ విష్ణువందన వ్యవహరించారు. కార్యక్రమంలో కర్నూలు బలిజ సంఘం అధ్యక్షుడు లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్ కుమార్, గౌరవ సలహాదారులు సోమశేఖర్ పాల్గొన్నారు.

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా చిరంజీవి



కర్నూలు (టౌన్): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయల కార్పొరేషన్ జోనల్ మేనేజర్‌గా టి. చిరంజీవి నియమితులయ్యారు. శనివారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ ఆయనను నియమిస్తూ జీఓ 66 జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ హోదాలో జాతీయ రహదారుల విభాగంలో పనిచేసే ఆయనను ప్రభుత్వం ఏపీఐఐసీకి బదిలీ చేసింది.

నేటి వరకే లేపాక్షి థీమాటిక్ ఎగ్జిబిషన్



ఏటికొప్పాక బొమ్మలను పరిశీలిస్తున్న నగర వాసులు

కర్నూలు(అగ్రికల్చర్): కొండారెడ్డి బురుజు సమీపంలోని లేపాక్షి ఎంపోరియం ప్రాంగణంలోని లేపాక్షి థీమాటిక్ ఎగ్జిబిషన్‌కు నగర ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని లేపాక్షి హ్యాండీక్రాప్ట్ ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య తెలిపారు. ఆదివారం ఒక్కరోజే ఈ ఎగ్జిబిషన్ ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. హస్తకళలల ఉత్పత్తులైన కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లేస్ అల్లికలు, టెర్రకోట మట్టి కుండలు, లెదర్ లాంప్ షేడ్స్ తదితర వస్తువులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇందులో లభించే అన్ని రకాల బొమ్మలు ఉత్పత్తి ధరకే లభిస్తాయని పేర్కొన్నారు. కర్నూలు నగరంతో పాటు జిల్లా ప్రజలు హస్తకళల ఉత్పత్తులను ఆదరించాలని సూచించారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమంచి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ రాష్ట్రమహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటుచేయాలన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతుండడంతో అందులో రిజర్వేషన్లను కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బీసన్న, కృష్ణ, చంటి, బాబయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడాకారులను తీర్చిదిద్దాలి



లక్ష్య ఫుట్‌బాల్ సెంటర్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించిన ఇండియన్ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేష్

కర్నూలు (టౌన్): క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని ఇండియన్ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేష్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న లక్ష్య ఫుట్‌బాల్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంగ్ టాలెంటెడ్ ప్లేయర్స్‌ను వెతికి, మంచి శిక్షణ అందించాలన్నారు. పారా ఒలింపిక్స్ మెడలిస్ట్ దీప్తి మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో మెడల్ సాధించడానికి ఎంతో కఠోరమైన శిక్షణ తీసుకున్నట్లు వెల్లడించారు. అదే స్థాయిలో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు.కర్నూలు లక్ష్య సెంటర్ ఫుట్‌బాల్ కోచ్ బ్రహ్మకుమార్, అథ్లెటిక్స్ కోచ్ హారిక పాల్గొన్నారు.

జాతీయ కాన్ఫరెన్స్‌లో ఆర్‌యూ వీసీ

కర్నూలు కల్చరల్: తమిళనాడులోని వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరుగుతున్న ఆల్ ఇండియా యూనివర్సిటీస్ సౌత్‌జోన్ వైస్ చాన్సలర్ కాన్ఫరెన్స్ 2024 -25లో రాయలసీమ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన కాన్ఫరెన్స్ శనివారం ముగిసింది. ఉన్నత విద్య భవిష్యత్‌ను రూపొందించడంలో భారతదేశం పాత్ర గురించి చర్చించడానికి ఏర్పాటు చేసి దక్షిణ భారత విశ్వవిద్యాలయాల భేటీలో తన ఆలోచనలు పంచుకున్నట్లు వీసీ తెలిపారు.



సౌత్‌జోన్ వైస్ చాన్సలర్ కాన్ఫరెన్స్‌లో ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్

ఘనంగా లూయీ బ్రెయిలీ జయంతి



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు మహేంద్రకుమార్

కర్నూలు (టౌన్): జాతీయ అంధు సమాఖ్యా ఆధ్వర్యంలో బి.క్యాంపులో లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు మహేంద్రకుమార్, కార్యదర్శి వెంకటక్రిష్ణుడు పాల్గొని లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని సమాఖ్య అంధ సభ్యులు 31 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు పుష్పరాజ్, విశ్వనాథ్ రెడ్డి, మహేశ్వర రెడ్డి, మరియమ్మ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యం

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను సీఎం చంద్రబాబు నాయుడు నెరవేర్చాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఏపీ ఇన్‌చార్జ్ సూర్యం డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ అధికారంలోకి రావడానికి లేనిపోని హామీలు ఇచ్చారన్నారు. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు, మహిళలకు నెలకు రూ.1500, రైతులకు రైతు భరోసా కింద రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.5 వేలు భృతి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లను విడుదల చేయాలన్నారు. డీఎస్సీ విడుదల చేసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు తిరుపాల్, అర్లప్ప, ఆశీర్వాదం, రాజేష్ పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న పోరాటం అజరామరం

కర్నూలు(అర్బన్): బ్రిటీష్ పాలకులపై వడ్డె ఓబన్న చేసిన పోరాటం అజరామరమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. శనివారం వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా బీసీ భవన్ వద్ద ఉన్న వడ్డె ఓబన్న విగ్రహానికి బీసీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యాధ్యక్షుడిగా వడ్డె ఓబన్న వీరోచిత పాత్రను పోషించారన్నారు. దట్టమైన నల్లమల అడవుల్లో జరిగిన భీకర పోరులో బ్రిటీష్ సైన్యాన్ని ఊచకోత కోసి పరుగులు పెట్టించిన పౌరుష వంతుడు ఓబన్న అని కొనియాడారు. రాయలసీమలో ప్రత్యేకించి కర్నూలు జిల్లాలో స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న వీరుల గురించి తెలుసుకునేందుకు వడ్డె ఓబన్న చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. ఆయన పోరాటం భావి తరాలకు ఆదర్శమన్నారు.



వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న నక్కలమిట్ట శ్రీనివాసులు

కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు ఎం రాంబాబు, పీజీ వెంకటేష్ పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న పోరాట స్ఫూర్తి మరువలేనిది

కర్నూలు: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న పోరాట స్ఫూర్తి మరువలేనిదని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జి.హుసేన్‌పీరా పేర్కొన్నారు. వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అడిషనల్ ఎస్పీ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, నారాయణ పాల్గొన్నారు.



వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

కర్నూలు(సెంట్రల్): ఏపీ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం బంగారుపేటలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయ నిర్ణేయతగా గౌతమి వ్యవహరించారు. విజేతలకు విశ్రాంత వైద్యుడు శంకర్ శర్మ బహుమతులను అందజేశారు. నాయకులు ఎస్. మునెప్ప, జగన్నాథం , రామకృష్ణారెడ్డి, గిడ్డమ్మ, శ్రావని, శ్రీనవాసులు, బీసన్న, శరత్, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

పీఏబీసీ, ఎస్టీబీసీకి వ్యతిరేకంగా తీర్పుపై హర్షం

కర్నూలు (టౌన్): 30 సంవత్సరాలుగా సీఎస్ నెంబర్ 124/ 94 సంవత్సరం నాటి కేసులో వాదోపవాదాలు విన్న మద్రాస్ హైకోర్టు పీఏబీసీ, ఎస్టీబీసీలను తప్పిస్తూ తీర్పు ఇవ్వడంపై ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ ఐక్య వేదిక నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. స్థానిక క్రైస్తవ ఐక్య వేదిక కార్యాలయంలో తెలుగు బాప్టిస్టు ఫీల్డ్ అధ్యక్షులు జెట్టి ప్రభుదాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పీఏబీసీ (ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్టు చర్చస్), ఎస్టీబీసీ (సమావేశం ఆఫ్ తెలుగు బాప్టిస్టు చర్చస్)లు క్రైస్తవ ఆస్తులను అన్యాక్రాంతం చేశాయన్నారు. వెనుకబడిన ప్రజలకు విద్య, వైద్యం ఉపాధి కల్పించేందుకు మిషనరీలు ఏర్పాటు చేసిన ఆస్తులను ఈ రెండు సంస్థలు దుర్వినియోగం చేశాయన్నారు. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా ట్రస్టీగా వ్యవహరిస్తున్న పీఏబీసీ, ఎస్టీబీసీలను తొలగించినట్లు వెల్లడించారు. సమావేశంలో క్రైస్తవ ఐక్య వేదిక నాయకులు జాషువా డేనియల్, ప్రాపర్టీ కమిటీ చైర్మన్ ప్రభాకర్, విక్టర్ ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం దృష్టికి కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలను నాయకులు శనివారం తీసుకెళ్లారు. కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్. బ్రహ్మేశ్వర్లు, నాయకులు డీకే ఈశ్వర్, కే.రామాంజనేయులు డిప్యూటీ సీఎంను కలిసి తమ సమస్యను వివరించేందుకు ప్రయత్నం చేయగా భద్రతా కారణాల వల్ల పోలీసులు అనుమతించలేదు. దీంతో వీరి సమస్యను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. 2000లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నోటిఫికేషన్ ఇచ్చి కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించారని, ప్రస్తుతం రాష్ట్రంలో 3,618 మంది ఉన్నారని, మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరిని రెగ్యులర్ చేసి ఆదుకోవాల్సిన అవసరం ఉందని పవన్‌కల్యాణ్‌కు వివరించగా.. ఆయన స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

శోభాయమానం శ్రీరాముల శోభాయాత్ర



శోభాయాత్రను ప్రారంభిస్తున్న సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: సీతారాముల కళ్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీరాముల వారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ఓల్డ్‌సిటీ జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. హిందువులందరూ ఐక్యంగా ఉండి హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయాలను పరిరక్షించుకోవాలన్నారు. అనంతరం లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం, సమితి అధ్యక్షులు కె.క్రిష్టన్న, గౌరవాధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు పూజలు నిర్వహించి శోభా యాత్రను ప్రారంభించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, పూల బజార్, మించిన్ బజార్, కొండారెడ్డి బురుజు, గోశాల, రాజ్‌విహార్ సమీపంలోని రేణుకాల ఎల్లమ్మ దేవాలయం వరకు యాత్ర సాగింది. కార్యక్రమంలో సమితి కార్యదర్శి నాగోజీ పాల్గొన్నారు.

వైభవంగా కూడారై సేవ



గోదా రంగనాథ స్వామికి పాయసాన్ని నైవేద్యంగా సమర్పించిన దృశ్యం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాయసాన్నంతో కూడారై సేవ వైభవంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను గోదా గోకులం మాడ వీధుల్లో ఊరేగిస్తూ గోదా రంగనాథ స్వామి ఆలయంలోకి చేర్చడంతో వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సామూహికంగా తిరుప్పావై పాశురాలను పారాయణం చేశారు. భక్తులకు పాయసాన్ని ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాప అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోకులం సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎర్రజెండా



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పేదలకు అండగా భారత కమ్యూనిస్టు పార్టీ నిలుస్తుందని ఆ పార్టీ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా నగరంలోని కారల్‌మార్క్స్ ఏరియాలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదంతా సీపీఐ శత జయంతి ఉత్సవాలను నిర్వహించాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. 100 ఏళ్లలో సీపీఐ పేదల కోసమే పనిచేసిందన్నారు. పేదలకు కూడు, గూడు పార్టీ లక్ష్యమన్నారు. అందుకోసం ఉద్యమాలు చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు కె.జగన్నాథం, సోమన్న, రబియా పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని జి.పుల్లయ్య, రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కళాశాలల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. 2009 నుంచి 2012 పూర్వ విద్యార్థులు సుమారు 250 మంది ఉత్సాహంగా పాల్గొని పాతరోజులను గుర్తు చేసుకుంటూ, ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కేతః శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.